





# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 16-07-2024 సంపుటి : 06 సంచిక : 300 పేజీలు : 8 వెల : రూ 3-00



# భూ కబ్జా చేయాలంటే భయపడేలా చేస్తా..

## గుజరాత్‌లోని చట్టాన్ని తెస్తా : ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతిజులై15 : గత ప్రభుత్వం ఐదేళ్లలో సహజ వనరులను దోపిడీ చేశారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. భూములు, ఖనిజాలు, అటవీ సంపదను దోచేశారని చెప్పారు. గత ప్రభుత్వ భూదందాలు, సహజవనరుల దోపిడీపై చంద్రబాబు సోమవారం శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్తులో భూకబ్జా చేయాలంటే భయపడేలా చేస్తామని హెచ్చరించారు. భూములు, ఆస్తులు కబ్జాలకు గురైతే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. గుజరాత్‌లో ఉన్న ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ఇక్కడా తెస్తామన్నారు.గత ప్రభుత్వం ఖనిజ సంపదను దోచేసిందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. వైసీపీ నేతలు అడవులను సైతం ధ్వంసం చేశారని మండిపడ్డారు. ఇళ్ల స్థలాల పేరుతో భూదోపిడీకి పాల్పడ్డారన్నారు. ఇష్టానుసారం భూములను ఆక్రమించారని విమర్శించారు. రీసర్వే పేరుతో భూముల హద్దులు మార్చేశారని.. విశాఖ మాజీ ఎంపీ హయగ్రీవ భూములు కాజేశారని ఆరోపించారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరులో భూకబ్జాలకు పాల్పడ్డారని అన్నారు. ఇళ్ల నిర్మాణం పేరుతో వైసీపీ నేతలు దందాలు చేశారని చంద్రబాబు అన్నారు. పంచభూతాలను సైతం మింగేశారని విమర్శించారు. వైసీపీ ఆఫీసుల కోసం ప్యాలెస్‌లు కట్టారని విమర్శించారు.ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక పరాకాష్ట అని చంద్రబాబు నాయుడు అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో భూదోపిడీకి కుట్రలు పన్నారని ఆరోపించారు. రామానాయుడు స్టూడియో భూములు కొట్టేసేందుకు విఫలయత్నం చేశారని అన్నారు. వృద్ధాశ్రమాలను కూడా వదిలిపెట్టలేదని తెలిపారు. వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ ల్యాండ్స్‌ను కూడా కొట్టేశారని అన్నారు. దస్పల్లా భూములను కొట్టేసి ఇళ్లు నిర్మించారని అన్నారు. మాజీ ఎంపీ ఎంవీవీ అనేక భూ అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ.101 కోట్ల ఆస్తి కాజేసేందుకు యత్నించారని అన్నారు. ఒంగోలు భూకబ్జాలపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టామని చెప్పారు.తిరుపతి, రేణిగుంటలోని మఠం భూములను కొట్టేశారని చంద్రబాబు తెలిపారు. తిరుపతి జిల్లాలో భూ అక్రమాలకు లెక్కే లేదని అన్నారు. 22-ఏ పెట్టి భూ అక్రమాలు చేశారని అన్నారు. చిత్తూరులో 782 ఎకరాలు కాజేసేందుకు ప్రయత్నించారని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు చేపట్టానని తెలిపారు. పుంగనూరులో 982 ఎకరాల పేదవారి అసైన్డ్ భూములకు పట్టాలు చేయించుకున్నారని అన్నారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైసీపీ నేతలే నిర్ణయించేవారని.. ముందే స్థలం కొని.. అనేక రెట్ల పరిహారం కొట్టేసేవారని తెలిపారు. గ్రామాల్లో ఉండే ఖాళీ భూములను ఆక్రమించారని విమర్శించారు. నివాసయోగ్యం కాని ఆవ భూములను కేటాయించారని చెప్పారు.

అక్రమంగా భవనాలు కట్టేశారని.. ప్రశ్నించే వారిపై దాడులు చేశారని తెలిపారు. 13,800 ఎకరాలను వైసీపీ నేతలకు ధారాదత్తం చేశారని.. తక్కువ ధరకు 40 వేల ఎకరాలను అప్పగించారని అన్నారు. అధికారులను బెదిరించి భూములకు పట్టాలు తెచ్చుకున్నారని విమర్శించారు. భూహక్కుపత్రం పేరుతో ప్రచారానికి రూ.13 కోట్లు ఖర్చు చేశారని.. భూముల రీసర్వే పేరుతో పట్టాలపై జగన్ చిత్రం ముద్రించుకున్నారని మండిపడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం మేరకు ప్రైవేటు వ్యక్తులను నియమించవచ్చని చంద్రబాబు తెలిపారు. ఎంతో అహంభావంతో ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం దురుద్దేశా లను ప్రజలు గ్రహించారని అన్నారు. ఒకసారి భూములను చెక్ చేసుకోవాలని ప్రజలను కోరారు. భవిష్యత్తులో భూకబ్జా చేయాలంటే భయపడేలా చేస్తామని హెచ్చరించారు. భూములు, ఆస్తులు కబ్జాలకు గురైతే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. గుజరాత్‌లో ఉన్న ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ఇక్కడా తెస్తామన్నారు. తాము భూమి యజమానులని కబ్జాదారులే నిరూపించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

# వరుస అల్పపీడనాలు.. ఉరుములు, మెరుపులతో ఏపీలో భారీ వర్షాలు..



అమరావతి జూలై15 ): వాయువ్య దానిని ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా తీరంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కి.మీ వరకు విస్తరించి ఎత్తుతో నైరుతి దిశగా వంగి ఉంటుంది.సముద్ర మట్టం వద్ద రుతుపవన ద్రోణి ఇప్పుడు జైసల్మేర్,కోట,గుణ,దామోహ్,పెండ్రారోడ్, సంబల్పూర్, పూరి గుండా వెళుతూ.. ఆగ్నేయ దిశగా వాయువ్య, ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై అల్పపీడనం సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి ఉంది.ఒక షీర్ జోన్ లేదా గాలుల కోత సగటు సముద్రానికి ఎగువన 3.1 & 7.6 కి.మీ మధ్య దాదాపు 20లీజౌ వెంబడి విస్తరించి ఎత్తుతో దక్షిణం వైపు వంగి ఉంటుంది. జూలై 19న పశ్చిమ మధ్య దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంపై వేరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. నిన్నటి గంగా పరివాహక పశ్చిమ బెంగాల్ ఢ దానికి ఆనుకుని ఉన్న జార్ఖండ్ ఢ ఒడిశా మీదుగా సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం నైరుతి దిశగా వంగి ఈరోజు తక్కువగా గుర్తించబడింది.

# సచివాలయాన్ని ముట్టడించిన బీసీ జనసభ కార్యకర్తలు..

## రాజారాం యాదవ్ అరెస్ట్



హైదరాబాద్: రాష్ట్ర సచివాలయం వద్ద ఉద్రిక్తత కొనసాగుతున్నది. నిరుద్యోగుల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా బీసీ జన సభ కార్యకర్తలు సచివాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిరుద్యోగలు, జనసభ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సెక్రటేరియ ట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీసీ జనసభ కార్యకర్తలను పోలీసు లు పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తింతి. జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా కార్యక ర్తలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో డీఎస్సీ ని వాయిదా వేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. డీఎస్సీ ని వాయిదావేయ కపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తా మని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్-1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రెటేరియట్ పోలీసుల వలయంలోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో సచివాలయం వద్ద భారీగా పోలీసులును మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుపకంచెలు, వాటర్ క్యానన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సచివాలయ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం 161 అర్జీలు

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణీయా





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 15-ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎ.పద్మజ, జిల్లా అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలన్నారుసమస్యల పరిష్కారంపై అర్జీదారులకు అధికారులు ఇచ్చిన ఎండార్స్మెంట్లు మొక్కుబడి రీతిలో ఉన్నాయే తప్ప సరైన రీతిలో ఎండార్స్మెంట్ ఇవ్వడం లేదన్నారు. సంబంధింత సమస్యకు ఖచ్చితమైన పరిష్కారం లేదా పరిష్కరించకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ అర్థమయ్యే రీతిలో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. రీఓపెన్ అయ్యే దరఖాస్తులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు సంబంధించిన ఫోటోలు అప్లోడ్ చేసే దాఖలాలే కనబడటం లేదని ఆమె వివరించారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ లో 7, రెవెన్యూలో 5, ల్యాండ్ అండ్ సర్వేలో 2, పోలీస్ డిపార్ట్మెంట్లో ఒక దరఖాస్తు బియాండ్ ఏస్ఎల్ఎ లో ఉన్నాయని వీటన్నిటిని స్వయంగా పరిశీలించి క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సర్వీస్ లకు సంబంధించి సివిల్ సప్లైస్, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలకు సంబంధించిన సమస్యలను సచివాలయాల వారీగా ఎంపీడీఓలు విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన పిటిషన్ లె అధికంగా వస్తున్నాయని... మండల, డివిజన్ స్థాయిలో రెవిన్యూ అధికారులు చురుకుగా పనిచేసి పరిష్కరించాలన్నారు. వచ్చేవారం నుండి రెవిన్యూ శాఖకు వచ్చే దరఖాస్తులు తగ్గుముఖం పట్టాలని ఆర్డీఓలు, తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 161 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.అంతకుముందు సెంటనరీ హాల్ ఆవరణంలో పిజిఆర్ఎస్ అర్జీల ఎంట్రీ విధానాన్ని పరిశీలించి సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు.

# తనపై బురదజల్లే వారిని వదిలిపెట్టం

## ఆదివాసీ మహిళా అధికారిణితో సంబంధాలా
## మీడియా ప్రతినిధుల తీరుపై విజయసాయి మండిపాటు



విశాఖపట్నం,జూలై15 : క్రమపద్ధతిలో తనపై కుట్రలు చేస్తున్నారని వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి ఆరోపించారు. కొన్ని మీడియా ఛానళ్లు.. ఆదివాసీ మహిళా అధికారిణితో సంబంధాలు అంటగట్టి అవాస్తవాలను ప్రసారం చేశాయన్నారు. నిరాధార ఆరోపణలు చేశారని ఆక్షేపించారు. పలువురు మీడియా ప్రతినిధులను పేరు పెట్టి హెచ్చరించారు. ఆయా ఛానళ్లపై ఫిర్యాదు చేస్తానని.. తనపై బురదచల్లే వారిని వదిలి పెట్టబోనని వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయి రెడ్డి మాట్లాడారు. ఆదివాసీ ఆడబిడ్డను బజారుకీడ్చి నా వ్యక్తిత్వంపై కుట్ర పన్నారు. గత మూడు రోజులుగా ట్రోల్ చేశారు. ఆరోపణలు చేసే ముందు వివరణ తీసుకోవాలి. అలా చేయకుండా అవాస్తవాలు టెలికాస్ట్ చేయడం ఘోర తప్పిదం. వారితో ఎలా క్షమాపణలు చెప్పించాలో తెలుసు. ప్రతిపక్షంలో ఉన్నారు.. ఏం చేస్తారు అనుకోవద్దు. దీనిపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేయడంతో పాటు ప్రైవేటు బిల్లు పెడతా. ఎడిటర్స్ గిల్డ్, మహిళా కమిషన్, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. పరువు నష్టం దావా వేస్తా. గతంలో ప్రజాదర్బార్ నిర్వహించేవాడిని. చాలా మంది తమ సమస్యలపై వచ్చి కలిసేవారు. అలా కలిస్తేనే సంబంధాలు అంటగడతారా? తారతమ్యాలు లేవా? వయసు తెలియదా? సాయిరెడ్డి తండ్రిలాంటివారని స్వయంగా అధికారిణెళి చెప్పింది. నేను కూడా త్వరలోనే నా సొంత మీడియాను ప్రారంభిస్తా. ఇప్పటికే కాలయాపన చేశాను.. మళ్లీ నిర్ణయం తీసుకున్నా. ఈసారి ఎవరు చెప్పినా వినేది లేదు. అందరి దుశ్చర్యలను ఎండగడతానని విజయసాయిరెడ్డి అన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 16-07-2024

## నివేదికలకే పరిమితమవుతున్న అధ్యయనాలు

నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో కొట్టుకుపోయి మొత్తం 65 మంది ప్రయాణికులు కొట్టుకుపోయిన విషాద సంఘటన తెలిసిందే. ఏటా ఈశాన్య భారతంలో కొండచరియలు విరిగిపడడం గ్రామాలు నేలమట్టమై కొన్ని వందల మంది సమాధి కావడం, రోడ్లు విధ్వంసమై ప్రజాజీవనానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడడం కొనసాగుతోంది. ఈ ముప్పు నివారణకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలో అనేక నివేదికలు సూచిస్తున్నా ఆ మేరకు ప్రభుత్వ పరంగా సరైన ప్రయత్నాలు జరగడం లేదు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) ఈ కొండచరియల ప్రమాదాలపై 2020లో అధ్యయనం నిర్వహించింది. దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్రపాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా గుర్తించింది. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండల క్వారీ పనులు కొండచరియలు అమాంతంగా విరిగిపడడానికి కారణమవుతున్నాయని జీఎస్‌ఐ హెచ్చరించింది. అలాగే కొండచరియలు విరిగిపడడానికి 51% అనువైన ప్రాంతం ఉత్తరాఖండ్ అని వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే భూకంపాలు సంభవించే ఆరోప్రాంతంగా ఈశాన్య ప్రాంతం ఉంటోంది. ఆరు నెలల పాటు ఈ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో కొండచరియల ముప్పు తప్పించడానికి నిర్మాణాత్మక ఇంజినీరింగ్ పనులు చేపట్టడం అవసరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచిస్తోంది. నేల స్వభావం పరిశీలించకుండా, పోడు వ్యవసాయం వంటివి నివారించకుండా, కొండచరియల ముప్పును తప్పించే మార్గాలు అన్వేషించకుండా ఎలాంటి అభివృద్ధి నిర్మాణాలు చేపట్టినా ప్రమాదమేనని భౌగోళిక సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటివేవీ పరిగణనలోకి తీసుకోకుండానే 2015లో లంబ్డింగ్ సిల్చార్ బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణాన్ని చేపట్టారని పరిశోధకులు తప్పుపట్టుతున్నారు. ఈ రైల్వే నిర్మాణంలో 2022లో 58 చోట్ల గండ్లు పడ్డాయి. జిరిబాం ఇంఫాల్ సెక్షన్‌లో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించడానికి, తగిన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి 'నేషనల్ ల్యాండ్‌స్లైడ్ ససెప్టిబిలిటీ మేపింగ్' ప్రక్రియను అమలు చేయవలసి ఉంటుందని జీఎస్‌ఐ సూచిస్తోంది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాల తో అత్యధిక సంఖ్యలో చెట్లు కూల్చివేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్యకాలంలో 10.76 మిలియన్ చెట్లు కూలిపోయాయి. అరుణాచల్‌లోని భారీ డిబాంగ్ డ్యామ్ నిర్మాణం కోసం 2.7 లక్షల చెట్లను కూల్చివేశారు. డెహ్రాడూన్‌లో ప్రాజెక్టుల కోసం 11,000 చెట్లను కూల్చివేయడానికి ప్రభుత్వవర్గాలు సిద్ధం కాగా సుప్రీం కోర్టు అడ్డుచక్రం వేసి ఆపగలిగింది. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. దీంతో నేల దృఢత్వం దెబ్బతిని కొండచరియలు విరిగి జారిపడుతున్నాయి. వాటికి చేరువలో నివాసాలు ఉంటే అవి నేలమట్టమవుతున్నాయి. రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా దక్షిణాఫ్రికావరకు తుపాన్లు చెలరేగడానికి హిమాలయాల పర్యావరణానికి సంబంధం ఉందని ఇండో అమెరికా మాన్సూర్ స్టడీ వెల్లడించింది. హిమానీ నదాలు దశాబ్దానికి 30నుంచి 60 మీటర్ల వంతున దాదాపు 10,000 వరకు కుదించుకుపోతున్నాయి. హిమాలయాల్లో ఎక్కువ భాగాన్ని ధ్వంసం చేసిన 2013 నాటి కేదార్‌నాథ్ విషాద సంఘటన నుంచి దేశం సరైన గుణపాఠం నేర్చుకోవడం లేదనిపిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు లబోదిబోమనడం, ఎంతమేరకు నష్టం జరిగిందో మదింపు చేయడం తప్ప ఈ వైపరీత్యాలకు మూలకారణాలేమిటో వాటిని ఎలా నివారించగలమో అన్న ముఖ్యమైన అంశాలపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించడం లేదు. ప్రకృతిపరంగా కొంత వైపరీత్యాలు జరుగుతుండగా, మానవ కల్పిత చర్యల వల్ల అంతకన్నా ఎక్కువగానే ప్రకృతికి నష్టం జరుగుతోంది. అలాంటి చర్యలను ప్రభుత్వాలు అడ్డుకోవడం లేదు. ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరిగే ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆ ప్రభుత్వం తన బడ్జెట్‌లో వైపరీత్యాల నివారణకు మూడోవంతు వెచ్చిస్తోంది. అయినా ఏం లాభం? సరైన ప్రణాళికలు అమలు కావడంలేదు. ముఖ్యంగా రహదార్ల నిర్మాణాల్లో నిబంధనలు పాటించడం లేదు. వాహనాల రాకపోకలు, జనం రద్దీ, నిర్మాణాల విషయంలో సరైన అంచనా వేయాలని 2020 లోనే సుప్రీం కోర్టు నియామక కమిటీ సూచించింది. పర్వత శిఖరాల్లో ఉన్న పట్టణాలు, నగరాల్లో పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో ఆయా ప్రభావాలను అంచనా వేయాలని, అధ్యయనం నిర్వహించి నివేదిక సమర్పించాలని కేంద్ర పర్యావరణ శాఖ కూడా ఆయా రాష్ట్రాలకు గుర్తు చేసింది. పర్వత ప్రాంతాల్లో నేల క్షీణించి కోతకు గురవడం, జోషిమఠ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో విపరీత పరిణామాలు సంభవించడం చర్చనీయాంశం అవుతున్నాయి. సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై చర్చలు కూడా జరుగుతున్నాయి. హిమాలయ రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం క్లిష్టమైన సమస్య. అందుకనే ఈ రాష్ట్రాల్లో శాస్త్రీయ విశ్లేషణ అనుసరించి కొన్నేళ్లుగా హెచ్చరిస్తున్నారు. అయినా నిబంధనలను త్రోసిరాజని రెండు వరసల రోడ్ల డిజైన్ ప్రకారం కొండల్లో రోడ్లను విస్తరించడం ప్రమాదాలకు దారి తీస్తోంది.

# శాంతి భద్రతల పరిరక్షణే పోలీసు ధ్యేయం.. ఎస్పీ గరికపాటి బిందు మాధవ్ వెల్లడి...



కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 15 విభారె న్యూస్..కర్నూలు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన... గరికపాటి బిందు మాధవ్ ఐపియస్. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకుంటాం. ప్రజలకు సేవలందించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాం. ఎక్కడైనా సమస్యలుంటే ప్రజలు పోలీసు యంత్రాంగానికి సమాచారం అందిస్తే సమస్యను బట్టి వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ఇంతకుమునుపు కర్నూల్ జిల్లా ఎస్పీగా పనిచేసిన జి. కృష్ణకాంత్ ఐపియస్ నెల్లూరు జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో గరికపాటి బిందు మాధవ్ ఐపియస్ కర్నూల్ జిల్లా ఎస్పీగా సోమవారం జల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మొదటగా ఏఆర్ సిబ్బందిచే గౌరవవందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన బిందుమాధవ్ ఐపియస్ ని కుటుంబ సమేతంగా పూరోహితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో మిడియాతో జిల్లా ఎస్పీ మాట్లాడారు. కర్నూలు జిల్లా ఎస్పీగా రావడం తనకు చాలా సంతోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులుకి, రాష్ట్ర డిజిపికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు సేవలందించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉ ంటామన్నారు. మహిళల భద్రతకు, మహిళల పై జరిగే నేరాల పై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. 100 రోజుల కార్యచరణ ప్రణాళిక లో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలు, దొంగతనాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉ ంచుతామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సహాకారం , సమన్వయంతో కలిసి పని చేస్తామన్నారు. సమస్యతో వచ్చిన ప్రతి ఒక్క బాధితుడికి తక్షణ పరిష్కారం అందేలా కృషి చేస్తాం. జిల్లా పోలీసులను అప్రమత్రం చేసి నేరాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. సిసి కెమెరాల నిఘాను బలోపేతం చేస్తాం. జిల్లా పోలీసుశాఖ కు జిల్లా ప్రజలు, మీడియా వారు తమ వంతు సహాకారం అందించాలని కోరుకుంటున్నామన్నారు. గరికపాటి బిందు మాధవ్ ఐపియస్ గురించి.. 2017 ఐపియస్ బ్యాచ్ కు చెందిన బిందు మాధవ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం , విజయవాడకు చెందినవారు. ఐపియస్ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత మొదటిసారిగా ప్రకాశం జిల్లాలో గ్రేహౌండ్స్ లో విధులు నిర్వర్తించారు. రంపచోడవరం నందు ఏఎస్పీగా ,గుంటూరు సెబ్ జాయింట్ డైరెక్టర్ గా, పల్నాడు అదనపు ఎస్పీగా ,ఎస్పీగా పదోన్నతి పొంది న తర్వాత గ్రేహౌండ్స్ లో, పల్నాడు జిల్లాలో ఎస్పీ గా పని చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు,డిస్పీలు , సిఐలు,ఆర్ ఐలు, ఎస్సైలు,ఆర్ ఎస్సైలు జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ

**బాధితులనే బాధించే అవకాశం**
**కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం**
**నూతన చట్టాలు - సమాజంపై ప్రభావం**
**సెమినార్ లో సీనియర్ న్యాయవాది. విద్యాసాగర్ రెడ్డి**

ఖమ్మం:కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. సిపిఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో విద్యాసాగర్రెడ్డి మాట్లాడుతూ గత చట్టాలు బ్రిటిష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పన పై దృష్టిసారించిన ప్రభుత్వం కులంకుషంగా చర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని కేవలం 43గంటల 23 సెకన్లు మాత్రమే చర్చించారని ఆయన తెలిపారు. పేరు బ్రిటిష్ చట్టాలదే అయినా చట్టాల మార్పు వెనక బిజెపి మార్క్ దాగి ఉందని 10 శాతం గతంలో ఉన్న భారతీయ శిక్షాస్మృతిని మార్చి భారతీయ న్యాయ సంహితను తీసుకు వచ్చారని ఇందులో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని ఆయన తెలిపారు. ఏ తప్పుకు ఏ శిక్ష అన్నది భారతీయ శిక్షాస్మృతి ప్రకారమే తీసుకుని భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక్ సురక్ష సంహిత భారతీయ సాక్ష్యా సంహిత చట్టాలను తీసుకు వచ్చారని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. పార్లమెంటులో విపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబరు 2023న పార్లమెంటులో 21 డిసెంబరు 2023న రాజ్యసభలో ఆమోదం పొంది 25 డిసెంబరు 2023న గెజిట్ గా రూపొందించబడిందని ఆయన తెలిపారు. ఈ చట్టాల అమలు వల్ల దుష్పరిణామాలను పరిగణలోకి తీసుకో లేదని ఐపిసిలో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో 358కి కుదించారని ఆయన తెలిపారు. 124 ఎ సెక్షన్లో గతంలో ఉన్న రాజ ద్రోహం స్థానే దేశ ద్రోహం చట్టాన్ని తీసుకు వచ్చారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 163వ సెక్షన్ సోషల్ మీడియాలో ఈ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినా, ప్రచారం నిర్వహించినా దేశ ద్రోహం కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కొన్నింటిలో పోలీసుల జోక్యాన్ని తగ్గించారని ముఖ్యంగా తూనికలు, కొలతలకు సంబంధించి గతంలో పోలీసులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసే వారని కానీ ఇప్పుడు పోలీసులకు అవకాశం లేదని కేవలం ఆ శాఖాధికారులు మాత్రమే తనిఖీలు నిర్వహించనున్నారని తెలిపారు. కొన్నిచట్టాలను కఠినతరం చేశారని గతంలో సాధారణ శిక్షల స్థానే ఇప్పుడు జీవితకాల ఖైదు, మరణ శిక్షను సైతంవిధించేవిధంగా చట్టాలను రూపొందించారన్నారు. ఇప్పుడు 16 ఏళ్ల లోపు బాలికపై అత్యాచారం జరిగితే కనీసం 20 ఏళ్లు శిక్షపడే అవకాశం ఉందన్నారు. గతంలో జీవిత ఖైదు అంటే కొన్నేళ్లకు పరిమితమయ్యేదని కానీ ఇప్పుడు సహాజ సిద్ధమైన జీవితం ఉన్నంత కాలం ఖైదు విధించే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలు ఒకటి జూలై 2024 నుంచి అమల్లోకి వచ్చిన గతంలో ఐపిసి ప్రకారం నమోదైన కేసులను ఆ సెక్షన్ల ద్వారానే విచారిస్తారని పాత కేసులు పూర్తయ్యే వరకు కొత్త, పాత చట్టాలతో పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఫోక్సో లాంటి కేసుల్లో బాధితురాలి పేరును కానీ, కుటుంబ పేరును కానీ విచారణ పూర్తయ్యేంత వరకు బహిర్గత పర్చరాదని పోలీసులు సైతం వివరాలు సీల్డ్ కవర్లో న్యాయమూర్తికి అందించి పేరుకు బదులు బాధితురాలి పేరును వాడాల్సి ఉంటుందని విద్యా సాగర్ రెడ్డి సూచించారు. మీడియా సైతం బాధితురాలి పేరును ఉచ్చరిస్తే శిక్షించే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతంలో ఉన్న చట్టాలను ఇప్పుడు తీవ్రతరం చేశారని ఢీకొట్టి పారిపోవడం లాంటివి చేస్తే పదేళ్ల వరకు శిక్ష ఉండే అవకాశం ఉందని నాన్బెయిలబుల్ కేసులు 102 (2) బిఎన్ఎస్ ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయవచ్చునన్నారు. ప్రభుత్వాల పట్ల కానీ, ప్రజాప్రతినిధుల పట్ల కానీ దురుసుగా ప్రవర్తించడం, అడ్డుకోవడం లేదా బెదిరింపులకు పాల్పడడం ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం లాంటి వాటిని నేరాలుగా పరిగణించి ప్రస్తుత నూతన చట్టాలలో శిక్షను ఖరారు చేశారని ఆయన తెలిపారు. కొన్ని సెక్షన్లలో పోలీసులకు విపరీతమైన అధికారాలు ఇచ్చారని గతంలో రెవెన్యూ అనుమతితో కూడిన చట్టాలు అమలయ్యే అవకాశం ఉండగా ఇప్పుడు పోలీసులే నేరుగా చట్టాన్ని అమలు చేసే అవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఇది ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమేనన్నారు. గతంలో హత్యాయత్నం కేసుకు సంబంధించి నేరం జరిగిన తీరును బట్టి జీవిత ఖైదు లేదా పదేళ్లు శిక్ష పడే అవకాశం ఉ ందన్నారు. అన్నింటికి మించి మోడీ, అమిత్ షాలను మాత్రమే సంప్రదించి ఈ చట్టాలను అమలు చేశారని ఇందులో న్యాయ నిపుణులను కానీ బార్ కౌన్సిల్ను కానీ పరిగణలోకి తీసుకోలేదన్నారు. కలెక్టర్ కొన్ని కేసులకు సంబంధించి స్పెషల్ ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్ను నియమించే అవకాశం ఉందని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఇది అధికార దుర్వినియోగానికి అవకాశం ఇస్తుందని ఆయన తెలిపారు. భారతీయ సాక్ష్యా సంహితలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించినసాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటున్నారని మారిన పరిస్థితుల్లో ఇది దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని మార్ఫింగ్ జరగడం ద్వారా నిందితులు తప్పించుకోవడం లేదా నేరస్తులు కానీ వారిని నేరస్తులుగా నిరూపించేఅవకాశం ఉ ందని విద్యాసాగర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహిళలపై దాడులకు సంబంధించి పోలీసులు అప్పటికప్పుడు ఎఫ్ ఐఆర్ చేయకుండా 14 రోజుల పాటు కాలయాపన ను ఉన్నతాధికారి అనుమతితో చేసే అవకాశం ఉందని దీని వల్ల కొన్ని సందర్భాలలో కేసులు తారుమారు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గతంలో ఓ కేసు నమోదైనప్పుడు అప్పుడు బాధ్యతల్లో ఉన్న అధికారి మాత్రమే కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆ స్థానంలో వచ్చిన అధికారులు ఎవరైనా సాక్ష్యం చెప్పే వెసులుబాటు కల్పించారని దీని వల్ల తీర్పుల్లో న్యాయం జరగక పోవచ్చునని ఆయన అన్నారు. ఈ సెమినార్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి. యర్రాబాబు, ఎస్కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఏఎల్ నాయకులు పట్టాభి, ఎస్ కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు శింగు నర్సింహారావు, ప్రముఖ న్యాయవాది ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'సుప్రీం'లో కర్ణాటక డెప్యూటీ సీఎంకు ఎదురుదెబ్బ..!

### హైకోర్టు ఆదేశాలపై జోక్యం చేసుకోలేమన్న కోర్టు..!

న్యూఢిల్లీ: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో సోమవారం ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తనపై సీబీఐ దాఖలు చేసిన కేసును రద్దు చేయాలని కోరుతూ శివకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయడంపై శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. అయితే, ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. కర్ణాటక హైకోర్టు ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు తాము సిద్ధంగా లేమని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ఎస్‌సీ శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. సీబీఐ కేసును



రద్దు చేయాలని శివకుమార్ గతంలో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఎలాంటి ఉపశమనం ఇవ్వలేదు. ఈ కేసును విషయంలో మూడునెలల్లోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. 2013-18 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శివకుమార్ మంత్రిగా ఉన్న సమయంలో ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లుగా సీబీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో 2020 సెప్టెంబర్ 3న కేసు నమోదు చేసింది. ఈ కేసును కోర్టులో సవాల్ చేశారు.

# విశాఖ వైసీపీ విలవిల.. ఎక్కడా కనిపించని వైసీపీ నేతలు



విశాఖపట్టణం, జూలై 15 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ నేతలు పూర్తి సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. అధికారంలో ఉండగా రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పిన జిల్లా నేతలు? ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. దాదాపు నెల రోజులుగా చాలా మంది లీడర్లు బయటకే రావడం లేదు. తమ ఓటమికి కారణాలేంటనే కనీస సమీక్ష కూడా చేయడం లేదు. ముఖ్యంగా పార్టీ అధికారంలో ఉండగా, మంత్రి పదవులను అనుభవించిన వారు ఎక్కడా కనిపించకపోవడం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారుతోంది.విశాఖ జిల్లాలో వైసీపీకి ఎందరో నాయకులు ఉన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉండగా, విశాఖను పరిపాలన రాజధాని చేస్తామని ఎంతో హడావిడి చేసింది. స్థానిక నేతలకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ పెద్దపీట వేసింది. మాడుగుల మాజీ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు, భీమిలి మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్‌లకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించింది వైసీపీ.ఐతే ఈ ముగ్గురూ ఈ ఎన్నికల్లో ఓడినా.. అమర్‌నాథ్ తప్ప, మిగిలిన ఇద్దరూ ఆచూకీ లేకుండా పోయారని క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రుషికొండ ప్యాలెస్‌పై తెగ హడావుడి చేస్తే? అమర్‌నాథ్ తప్ప ఏ ఒక్క వైసీపీ నేత కూడా పల్లెత్తు మాటాడలేదు. దీంతో వైసీపీ ఆత్మరక్షణలో పడిపోవాల్సివచ్చింది. పార్టీ అధికారంలో ఉండగా అధికారం అనుభవించిన నేతలు? ఓటమి తర్వాత సైలెంట్ అవడాన్ని కార్యకర్తలు ఆక్షేపిస్తున్నారు.రాష్ట్రంలో జిల్లాలకు జిల్లాల్లోనే వైసీపీ తుడిచిపెట్టుకుపోగా, విశాఖ జిల్లా మాత్రం ఆ పార్టీకి గౌరవం దక్కేలా రెండు ఎమ్మెల్యే, ఓ ఎంపీ సీటులో గెలిపించారు ఓటర్లు. ఇక ఓ రాజ్యసభ ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్సీలు కూడా వైసీపీ తరఫున ఉన్నారు. అంటే రాష్ట్రంలో మరే జిల్లాలోనూ లేనంత సంఖ్యలో ఆరుగురు ప్రజాప్రతినిధులు ఉమ్మడి విశాఖ నుంచి వైసీపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.కానీ, వీరెవరూ ఎన్నికల ఫలితాల తర్వాత కనిపించలేదు. విశాఖ, అనకాపల్లిలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయాలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తప్ప, మిగిలిన నేతలు అంతా పార్టీ గప్‌చుప్ అన్నట్లే వ్యవహరిస్తున్నారు.జిల్లాలో వైసీపీకి బలమైన నేతలు ఉన్నారని ఇన్నాళ్లు క్యాడర్ మురిసిపోయేవారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ గతంలో దూకుడుగా వ్యవహరించి? ఆయా నియోజకవర్గాల్లో సర్వం తామే అన్నట్లు చక్రం తిప్పేవారు. ఐతే పార్టీ ఓడిపోయాక వీరెవరూ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్‌తోపాటు జిల్లా పరిషత్‌లోనూ వైసీపీయే అధికారంలో ఉంది. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత ఈ పదవుల్లో ఉన్న నేతలు సైతం పార్టీపరమైన పనులకు దూరంగానే ఉంటున్నారు.ఇలా మొత్తం ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ ముఖ్య నేతలు పత్తాలేకుండా పోవడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసిన నేతల కోసం తామెంతో త్యాగాలు చేసి.. క్షేత్రస్థాయిలో పోరాడితే.. ఇప్పుడెవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఇదే అదునుగా అధికార పక్షం టార్గెట్ చేస్తుండటంతో . పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు. మొత్తానికి నేతల అజ్ఞాత వాసంతో విశాఖ వైసీపీ విలవిల్లాడిపోతోంది.

# టీటీడీ సేవల్లో పారదర్శకత

తిరుమల, జూలై 15 శ్రీవారి దర్శనంతో పాటు వసతి సేవల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు టీటీడీ సిద్ధమైంది. దళారుల ప్రమేయం లేకుండా, మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది .భక్తులకు ఆఫ్‌లైన్ (కౌంటర్ సేవలు) మరియు ఆన్‌లైన్ (వెబ్ పోర్టల్) రెండింటిలోనూ అందించే సేవలను అనేక మంది మధ్యవర్తులు భక్తులను మోసం చేసి, భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు టీటీడీ గుర్తించింది. గత ఏడాది కాలంగా ఆన్‌లైన్ లో (రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శనం, డిప్, వసతి, ఆర్జిత సేవాలు, వర్చువల్ సేవలు మొదలైనవి) మరియు ఆఫ్‌లైన్ లో (ఎస్ ఎస్ డి టోకెన్లు, వసతి) తదితర సేవల బుకింగ్‌లపై ఇటీవల టీటీడీ విచారణ జరిపింది. ఇందులో ఒకే మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలు ఉపయోగించి మధ్యవర్తులు బల్క్ బుకింగ్ పొందినట్లు విచారణలో తేలింది.ఈ ఏడాది తిరుమలలో కరెంట్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌తో 110 గదులు, 124 బుకింగ్స్ సంబంధించి 12కు పైగా గదులు పొందినట్లు అధికారుల విచారణలో నిర్ధారణ అయింది. అదేవిధంగా ఆన్‌లైన్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌ను ఉపయోగించి 807 వసతి బుకింగ్‌లు, ఒకే ఇమెయిల్ ఐడిని ఉపయోగించి 926 వసతి బుకింగ్‌లు చేసినట్లు తేలిందిఒకే మొబైల్ నంబర్‌ని ఉపయోగించి ఒక సంవత్సరంలో 1,279 డిప్ రిజిస్ట్రేషన్‌లు, ఒకే మెయిల్ ఐడిని ఉపయోగించి ఒక సంవత్సరంలో 48 డిప్ రిజిస్ట్రేషన్‌లు, ఒకే ఐడి ప్రూఫ్‌ని ఉపయోగించి 14 ఎస్ ఎస్ డి సర్వ సర్వదర్శనం టోకెన్‌లు పొందినట్లు టీటీడీ విచారణలో గుర్తించారు.విచారణలో కీలక అంశాలు వెలుగు చూడటంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అందిస్తున్న సేవలలో పారదర్శకతను మరింతగా పెంచేందుకు సిద్ధమైంది. ఈ సేవలను మరింత మెరుగుపరిచి ఆఫ్‌లైన్‌లో మరియు ఆన్‌లైన్‌లో టికెట్లు పొందే దళారులు మరియు మధ్యవర్తులపై చర్యలు చేపట్టింది.ఇందులో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్‌లు, మెయిల్‌లు మరియు ఐడి ప్రూఫ్‌లను టీటీడీ రద్దు చేసింది. ఫేక్ మొబైల్ నెంబర్లు, మెయిల్ ఐడిలు, ఐడి ప్రూఫ్ లు ఉపయోగించి ఇప్పటికే బుక్ చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతించబడవు. బుకింగ్ రద్దు అయినట్లు రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు తెలియజేయబడుతుంది.నిజమైన యాత్రికులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టీటీడీ కార్యాచరణ రూపొందిస్తుంది. దళారులు ఫేక్ మొబైల్, మెయిల్, ఐడి ప్రూఫ్‌లను ఉపయోగించి చేసిన బుకింగ్‌లపై కఠినమైన ఆంక్షలు విధించారు. సరైన ధృవీకరణ కోసం ఆధార్ సేవలను ఉపయోగించేలా కూడా ప్రయత్నాలు చేపడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపింది.

# మెట్రో ప్రాజెక్టు లో కదలికలు

విశాఖపట్టణం, జూలై 15 విశాఖవాసులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శుభవార్త అందించింది. ఇటీవల విశాఖలో పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులో కొంత కదలిక వచ్చింది. విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నడుం బిగించింది. ఈ క్రమంలోనే విశాఖ పర్యటనలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి గతంలో నిర్ణయించిన డిజైన్లకు అధికారులు కొన్ని మార్పులు చేయనున్నారు. విశాఖలో ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించే ఫ్లై ఓవర్ బ్రిడ్జిల ఆధారంగా మెట్రో డిజైన్లు ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్‌ఏఐతో సమన్వయం చేసుకును ముందుకు వెళ్లేందుకు వీలుగా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి సీఎం చంద్రబాబు పర్యటన అనంతరం కదలిక వచ్చింది. మెట్రో రైలుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక –డీపీఆర్‌లోనూ కొన్ని మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మెట్రో పనుల్ని ముందుకు తీసుకువెళ్లాలన్న తన ఆలోచనలను ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ ఎండీ యూజేఎం రావుకు తెలిపారు.ఇక నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు పలుచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వాటిని నిర్మించిన తర్వాత మెట్రో నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తవచ్చన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్‌హెచ్‌ఏఐకి, మెట్రో రైలుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం విశాఖలో 12 ఫ్లై ఓవర్లు నిర్మించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ డీపీఆర్ సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలోనే కొన్ని ప్రాంతాల్లో పిల్లర్ల చుట్టుకొలత పెంచడం, కొన్ని అదనంగా నిర్మించడం, వంతెనల పొడవు, వెడల్పుల్లోనూ కొన్ని మార్పులు చేయనున్నారు. అయితే అధికారుల సమావేశం తర్వాత త్వరలోనే వాటిపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.2017 లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించింది. 2018 లోనే అర్హత కలిగిన 5 సంస్థలు మెట్రో రైలు నిర్మాణానికి ఆసక్తి చూపాయి. ఎస్సెల్ ఇన్‌ఫ్రా కన్సార్టియం ఫైనాన్షియల్ అనే సంస్థ బిడ్ దాఖలు చేయగా.. ప్రాజెక్టు పట్టాలెక్కే సమయానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు రావడం.. అప్పుడు చంద్రబాబు ఓడిపోవడంతో అది అక్కడే ఆగిపోయింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. అంతకుముందు పిలిచిన టెండర్లతో పాటు డీపీఆర్‌ను రద్దు చేసి మళ్లీ కొత్తగా మొదలు పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 46 కిలోమీటర్లతో మొదట దశ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిచేయాలని నిర్ణయించగా.. తర్వాత వైసీపీ సర్కార్ దాన్ని అనకాపల్లి నుంచి భోగాపురం వరకు 140.13 కిలోమీటర్లకు పెంచింది.

# జీపీఎస్ పై ఉద్యోగుల ఆగ్రహం

విజయవాడ, జూలై ‘15 ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు ఊహించని షాక్ తగిలింది. జీపీఎస్ అమలుకు తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన గ్యారెంటీ పెన్షన్ సిస్టమ్ (జీపీఎస్) అమలపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే దీనిపఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సీపీఎస్, జీపీఎస్‌ను సమీక్షంచి ఆమోదయోగ్యమైన పరిష్కారం చేస్తామని టీడీపీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న చంద్రబాబు, అధికార బాధ్యలు చేపట్టిన నెలకే గెజిట్ విడుదల చేయడమేంటనీ ప్రశ్నిస్తున్నాయి.2023 అక్టోబర్ 20 నుంచే అమలులోకికంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ గ్యారెంటీ పెన్షన్ సిస్టమ్ (ఏపీజీపీఎస్)లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 అక్టోబర్ 20 నుంచే జీపీఎస్ అమలులోకి వస్తుందని గెజిట్‌లో పేర్కొంది. జీపీఎస్ చట్టం–2023లోని చాప్టర్ 1లోని సెక్షన్ 1, సబ్ సెక్షన్ (3) ప్రకారం ఈ గెజిట్ విడుదల చేసినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ పేరు మీదుగా గెజిట్ విడుదల అయింది.జీపీఎస్‌కి సంబంధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికార బాధ్యతలు తీసుకున్న జూన్ 12నే జీవో నెంబర్ 54ను విడుదల చేశారు. అయితే ఈ జీవోను బయటికి రాలేదు. శుక్రవారం విడుదల చేసిన గెజిట్‌లో జూన్ 12వ తేదీనే జీవో నెంబర్ 54 విడుదల చేశామని పేర్కొన్నారు.2019 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేస్తానని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కానీ సీపీఎస్‌ను రద్దు చేయలేదు. దీంతో సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటానికి సిద్ధమయ్యాయి. 2022 ఫిబ్రవరి 3న విజయవాడలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కదం తొక్కారు. భారీగా హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయలతో విజయవాడలో ప్రభంజనం సృష్టించారు. దీంతో దిగొచ్చిన ఏపి ప్రభుత్వం సీపీఎస్‌పై కమిటీ వేసేందుకు సిద్ధపడింది. ఈ క్రమంలోనే ఉద్యోగులు, ఉపాధ్యాయల మధ్య విభజనకు కూడా ప్రభుత్వం పూనుకుంది. దీంతో ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయలు కన్నెర్ర చేశారు.ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆందోళనకు దిగొచ్చిన ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న కమిటీ వేసింది. ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బొత్స సత్యనారాయణ, ఆదితమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపింది. అనంతరం ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు సూచిస్తూ నివేదిక ఇచ్చింది. దానికనుగుణంగా సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చింది. దీన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి.అయితే ఇటీవలే జరిగిన (2024 మే 13న) ఎన్నికల మ్యానిఫెస్టోలో టీడీపీ అధినేతగా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు హామీ ఇచ్చారు. ప్రజాగళం పేరుతో విడుదల చేసిన టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి మ్యానిఫెస్టోలో కూడా సీపీఎస్, జీపీఎస్‌పై పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి పునఃసమీక్ష చేయలేదు. ఇదే సమయంలో జీపీఎస్ అమలుపై అధికార బాధ్యతలు చేపట్టిన రోజే (జూన్ 12న) జీవో నెంబర్ 54 తీసుకొచ్చారు. సరిగ్గా నెల రోజుల తరువాత శుక్రవారం రాత్రి (జులై 12న) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మండిపడుతున్నాయి. అయితే ఈ గెజిట్ పై ప్రభుత్వంలోని పెద్దలు స్పందించాల్సి ఉంది?!రద్దు చేయాల్సిందేః యూటీఎఫ్ నేతలు డిమాండ్ జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ దుర్మార్గమని, దీన్ని వెంటనే రద్దు చేయాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఇదొక దుర్మార్గమైన చర్యఅని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించడమే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని తెలిపారు.

# ఆ మంత్రి పదవిపై ఆశలు

విజయవాడ, జూలై 15 ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు? ఏది చేసినా దానికో లెక్క ఉంటుంది? డిప్యూటీ సీఎం పవన్ సినీ డైలాగ్ నాకో లెక్కంటుంది? గుర్తు చేసేలా చంద్రబాబు యాక్షన్ ఎప్పుడూ సస్పెన్స్‌గానే ఉంటుంది. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సీఎం చంద్రబాబు? తొలిసారే 24 మందిని తన క్యాబినెట్‌లోకి చేర్చుకున్నారు.సంఖ్యాపరంగా ఏపీ క్యాబినెట్‌లో 25 మందిని చేర్చుకోవచ్చు. కానీ, చంద్రబాబు వ్యూహాత్మకంగా ఒక్క ఖాళీని వదిలేశారు. ఇలా ఆ ఒక్కటి ఎందుకు భర్తీ చేయలేదని మంత్రివర్గం కొలువుదీరిన నుంచి ఇప్పటివరకు తెలుగు తమ్ముళ్లు చెవులు గొణుక్కుంటున్నారు. ఇక మంత్రి పదవులు రాని లీడర్లు అయితే తమ కోసమే ఆ ఖాళీ ఉంచేశారని ఆశతో కాలం గడిపేస్తున్నారు. కానీ, బాబు వ్యూహం ఏంటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.క్యాబినెట్‌లో ఒక్క ఖాళీ వదిలేయడంతో ఇటు టీడీపీ? అటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నుంచి ఆశావహులు మంత్రి పదవిపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఆశావహుల లెక్క చెప్పమంటే వన్ ఈస్ హండ్రెడ్ అబౌ అన్నటుగా? వంద మందికి పైనే మంత్రి పదవి కోసం కలలు కంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలతోపాటు కొందరు ఎమ్మెల్సీలు.. ఎమ్మెల్సీ హామీతో ఎన్నికల్లో గట్టిగా పనిచేసిన సీనియర్లు ఉన్నారు. దీంతో చంద్రబాబు క్యాబినెట్ బెర్త్‌ను ఎప్పుడు పూర్తిస్తారా? అని అంతా ఎదురుచూసేలా ఆ ఒక్క ఖాళీ ఊరిస్తోంది.చంద్రబాబు రాజకీయ చాణక్యుడు. ఆయన రాజకీయం ఎవరికీ ఒక పట్టాన అర్థం కాదు. ఆయన అన్ని మంత్రి పదవులూ ఇచ్చేసి మరీ ఒక్క బెర్త్‌ని అలా ఉంచడం దేనికి సంకేతం మంటూ మరికొంతమంది నేతలు చర్చించుకుంటున్నారు. అసలు ఎవరి కోసం ఆ ఒక్క బెర్త్‌ను పెండింగ్‌లో ఉంచారనేది ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.ప్రస్తుతం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి 164 మంది సభ్యుల బలం ఉంది. ఇందులో 24 మంది ఇప్పటికే మంత్రులుగా ఉన్నారు. మరికొందరికి ప్రభుత్వ చీఫ్‌విప్, విప్ పదవులు కట్టబెట్టనున్నారు. ఐతే ఖాళీగా ఉన్న ఒక్క మంత్రి పదవిపై పలువురు సీనియర్లు కన్నేశారు. సీఎంపై ఒత్తిడి పెంచేందుకు రకరకాల మార్గాల ద్వారా ప్రయత్నిస్తున్నారు.అటు శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం వరకు చాలా మంది మంత్రి పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రస్తుతం మంత్రి అచ్చెన్నాయుడు ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఆ జిల్లా నుంచి కాళింగ సామాజిక వర్గానికి చెందిన కూన రవికుమార్ కూడా బెర్త్ ఆశిస్తున్నారు. అదేవిధంగా విజయనగరం నుంచి కళావెంకటరావు, విశాఖ నుంచి గంటా శ్రీనివాసరావు మంత్రి చాన్స్ రాకపోదా? అనే ఆశతోనే కాలం గడుపుతున్నారు.ఉభయ గోదావరి జిల్లాల నుంచి?ఇక ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇప్పటికే ఎక్కువ మందికి ప్రాధాన్యం కల్పించగా, సీనియర్ నేత రఘురామకృష్ణంరాజు, చింతమనేని ప్రభాకర్ తమ వంత ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కృష్ణా గుంటూరు జిల్లాల నుంచి దేవినేని ఉమా, మండలి బుద్ధప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజా కూడా గుర్తింపు కోసం తహతహలాడుతున్నారు.ఉమా, రాజా పొత్తుల్లో తమ సీట్లను త్యాగం చేశారు. వీరికి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఈ ఇద్దరూ మంత్రి పదవి కోసం ఎదురుచూస్తున్నారు. ఇక నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాయలసీమ ప్రాంతానికి చెందిన కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, కోట్ల జయప్రకాశ్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి వంటివారూ అవకాశం ఇవ్వకపోతారా? అన్నట్లే ఎదురుచూస్తున్నారు.ఇదే సమయంలో బీజేపీ, జనసేన కూడా మరో మంత్రి పదవిని ఆశిస్తున్నాయి. ఇంతమందిని ఆశగా ఎదురుచూసేలా చేసిన హెచ్చరికలు జారీ చేశారు సీఎం చంద్రబాబు. దీంతో ఆ ఒక్కఖాళీ ఉండటం వల్ల ఎప్పుడైనా విస్తరణ జరిగే అవకాశం ఉందని? దీంతో తమ పదవి మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతుందేమోనని మంత్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. మొత్తానికి సీఎం చంద్రబాబు వ్యూహాత్మకంగా ఉంచిన ఒక్క ఖాళీ అందరినీ అటెన్షన్‌లో పెడుతోందంటున్నారు.

# టీడీపీ, వైసీపీ మధ్య మాటలయుద్ధం

విశాఖపట్టణం, జూలై 15 ఉత్తరాంధ్ర అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ మధ్య మాటలయుద్ధం సాగుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో తమ హయాంలో అభివృద్ధి సాధించిందని తెలుగుదేశం చెబుతుంటే ఉత్తరాంధ్రకు టీడీపీ చేసిందేమీ లేదని వైసీపీ ఆరోపిస్తోంది. తాజాగా ఆ ప్రాంతంలో చంద్రబాబు పర్యటించటం.. కూటమికి అద్భుతవిజయం కట్టబెట్టిన మూడు జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో వైసీపీ నేతలు ఉలిక్కిపడుతున్నారు. గత ఎన్నికల్లో తాను గెలిస్తే.. విశాఖను రాజధానిగా చేయటంతో పాటు అక్కడ నుంచే పాలన చేస్తామన్న జగన్.. ఆ ప్రాంతానికి చేసిందేమీ లేదనేది జనం మాట. రాజధాని అంటూ ప్రకటన చేశారు తప్ప.. అక్కడ అభివృద్ధి ఏదనేది టీడీపీ ఆరోపణ. కాబట్టి ఉత్తరాంధ్రపైనే ఇరుపార్టీల నేతల మధ్య వాగ్వాదం సాగుతోంది.సీఎం హోదాలో తొలిజిల్లా పర్యటనను ఉత్తరాంధ్రలో సీఎం చంద్రబాబు పెట్టుకున్నారు.ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా ప్రతి ఎకరానికీ నీరిస్తామని హామీ ఇచ్చారు. అనకాపల్లికి తాగు, సాగు నీరిస్తే తన జన్మ ధన్యం అవుతుందన్నారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలనే సంకల్పంతోనే పని చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే పనులు ఏ విధంగా జరుగుతున్నాయో.. ప్రజలంతా గమనించాలన్నారు. దీంతో పాటు సీఐఐ సదస్సు, మెడ్‌కో ప్రతినిధులతోనూ భేటీ అయ్యి అభివృద్ధి అంశాలు, పెట్టుబడులపై సీఎం చర్చించారు.ఉత్తరాంధ్రపై చంద్రబాబు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్. జగన్‌ను విమర్శించడంపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టాలని సూచించారు. తాము ఉత్తరాంధ్ర కోసం చాలా చేశామని.. టీడీపీ నేతలు మాటలు మాని.. అభివృద్ధి చేసి చూపించాలని



అన్నారు.వైసీపీ నేతలపై విమర్శలు మాని.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని మాజీమంత్రి పేర్ని నాని అన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను మర్చిపోయారని.. మళ్లీ అభివృద్ధి అంటూ జనంలోకి వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా పనులు చేసి చూపించాలంటూ సవాల్ చేశారు పేర్నినాని.మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్‌లు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలపై కౌంటరిచ్చారు బుద్దా వెంకన్న. కూటమి సర్కారు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని.. చెప్పినవన్నీ పూర్తి చేస్తామంటూ కౌంటర్ ఇచ్చారు. ఇచ్చిన హామీలను జగన్ నెరవేర్చలేదు కాబట్టే.. వైసీపీని జనం తిరస్కరించారని.. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తు పెట్టుకోవాలని సూచించారు.మొత్తానికి ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న వైసీపీ నేతలు.. టీడీపీపై విమర్శలు చేయటం ద్వారా ఉనికి చాటుకునే యత్నాలు చేస్తున్నారని రాజకీయవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

# కుష్టు వ్యాధులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## వైద్య సిబ్బందిని ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 15–ఈ నెల18వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాల్లో పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక లో భాగంగా జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్వో ఏ పద్మజ, ఇతర వైద్యాధికారులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే కుష్టు వ్యాధిగ్రస్తులను ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు రెండో తేది వరకు ఇంటింటికి వెళ్లి గుర్తించే విధంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఆదేశాలు జారీ చేయాలని డీఎంహెచ్వో ను ఆదేశించారు. కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించే విధానంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. గుర్తించిన అనంతరం ఏ విధమైన చికిత్సలు అందించాలి, మందులు వాడే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలను సమన్వయం చేసుకొని చురుకుగా పనిచేయాలని ఆమె ఆదేశించారు. అలాగే కుష్టు వ్యాధి లక్షణాలను వున్న వ్యక్తిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధిని అరికట్టి, అంగవైకల్యం రాకుండా నివారించవచ్చున్నారు.జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 02 నుంచి 06 సంవత్సరాల వయసు పిల్లలను, అన్ని పాఠశాలల్లోని పిల్లలను, సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ, పట్టణ వార్డులలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటరమణ, డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్. టిబి అధికారి యం.శారద బాయి కుష్టు వ్యాధి లక్షణాలు తెలియచేశారు. మల్టి డ్రగ్ థెరపీ చికిత్స ద్వారా కుష్టు వ్యాధి త్వరగా నయం అవుతుందని తెలియచేస్తూ, ఈ మందులు ప్రతి ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. అలాగే ఈ సర్వేను జిల్లాలో 1610 టీమ్స్ ( టీం నందు 1 ఆశా మరియు 1 మేల్ వాలంటీర్స్ వుంటారు) తో సర్వే చేయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని కలెక్టర్ తెలిపారు.

# ఖాజా హుస్సేన్ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు




విభారె న్యూస్. జూలై 15. కర్నూల్ ప్రతినిధి.కర్నూల్ సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ గారు మక్కాయాత్రకు (ఉమ్రా యాత్ర) వెళుతున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి సాకే శైలజనాథ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు గఖాజా హుస్సేన్ గారికి శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. శైలజనాథ్ మాట్లాడుతూ ఖాజా హుస్సేన్ అల్లా దయతో ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకొని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ఉపాధ్యక్షులు కే వెంకటరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సి వెంకట రాముడు మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాద్రి పాషా, డిసిసి కార్యదర్శి అబ్దుల్ హై మొదలు గారు పాల్గొన్నారు.

# చూసిన కనులదే బాగ్యమట



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 15–శ్రీజగజ్జననీ అమ్మవారికి పుట్టింటి పట్టుచీర చూసిన కనులదే బాగ్యమట భక్తుల మాట . నంద్యాల పట్టణంలోవెలసినశ్రీజగజ్జననీ అమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాడమాసం పూజల్లో భాగంగా అనంతపురం, ఐజ, గుంటూరు, డోన్, కర్నూలు, చాగలమర్రి,తాడిపత్రి,సత్తెనపల్లిసంగపట్నం, పిడుగురాళ్ల నుంచి మహిళలు తరలివచ్చి శ్రీ జగజ్జనని అమ్మవారికి పుట్టింటి పట్టుచీరే సారే తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు.

# వాసంతి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 15–నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం ముచ్చుమర్రి గ్రామంలో మానవ మృగాలు చేతిలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ విద్యార్థుల చేతిలో అత్యంత దారుణంగా అత్యాచారం , హత్య చేసి మృతదేహాన్ని మాయం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమష్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గారికి జేఏసీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వాసంతికి న్యాయం జరగాలని నిరసన , ధర్నా కార్యక్రమాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా నంద్యాల విద్యార్థి , యువజన , ప్రజా సంఘాల నేతలు రామినేని రాజునాయుడు , బందెల ఓబులేసు , శేక్ రియాజ్, జయరాజు , మధు కిరణ్ , నాగార్జున , నాగసారి సుంకన్న , రవీంద్ర నాయక్ , బత్తిని ప్రతాప్ , శేక్ ఫకూర్ , పవన్ కుమార్ , అక్రమ్ తదితరులు మాట్లాడుతూ చిన్నారి వాసంతి మృతికి కారణమైన ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.వాసంతి కుటుంబానికి 25 లక్షల రూపాయలు ఎక్రేషియా , ఇద్దరి పిల్లలకు ఉచిత విద్య , కుటుంబానికి ఐదు ఎకరాల పొలం , కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు.


# నాడు నేడు లో అక్రమాలపై విచారణ జరిపించాలి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 15–గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి కోసం నాడు నేడు ద్వారా బడ్జెట్ విడుదల అయ్యి ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న పనులను ఈ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు నంద్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షుడు పవన్ అధ్యక్షత వహించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి గారికి పి డి ఎస్ యు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ గారు సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని మరియు నాడు నేడు లో ఎవరైతే అక్రమాలు చేసారో వారిపై విచారణకు ఆదేశిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో వున్నా నాడు నేడు పనులను త్వరగా చేపట్టాలని పీ డీ ఎస్ యూ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వం నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేస్తామని చెప్పి మధ్యలోనే పనులను ఆపేసిందని దాని వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో తరగతి గదులు పూర్తి కాక విద్యార్థులు చెట్ల కింద విద్యను అభ్యసిస్తున్నారని ఆ పనులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని కోరుతున్నాను. గత ప్రభుత్వం నాడు నేడు కు దాదాపుగా 300 కోట్ల వరకు బడ్జెట్ కేటాయించిందని కానీ ఇసుక కొరత వల్ల ఎక్కడి పనులను అక్కడి నిలిపివేసిందని అందులో చాలా అక్రమాలు జరిగాయని వాటి పైన కూడా విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరియు సంక్షేమ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ లో మెస్,కాస్మోటిక్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని హస్టల్ లకు సన్న బియ్యం సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమం లో నాయకులు సతీష్, వేణు, సందీప్, ఆరిఫ్ పాల్గొన్నారు

# ఆదర్శ మున్సిపాలిటీగా ఎమ్మిగనూరును తీర్చిదిద్దుతా..

## - ఎమ్మెల్యే డాక్టర్ బి.వి జయనాగేశ్వర రెడ్డి....




ఎమ్మిగనూరు జూలై 15 విభారె న్యూస్. .ఎమ్మిగనూరు మున్సిపాలిటీ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ సమావేశ భవనం నందు సమీక్షా సమావేశం నిర్వహించారు.పట్టణ సుందరీకరణపై దృష్టి పెట్టి పట్టణానికి పూర్వవైభవం తేవాలని ఎమ్మెల్యే బీవీ మున్సిపల్ అధికారులను కోరారు.పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి పట్టణంలో పార్కు పునరుద్ధరణ, సుందరీకరణ చేయడం జరుగుతుందన్నారు. పార్కుల్లో వాకింగ్ ట్రాకర్, మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు కోసం ప్రణాళికను సిద్ధం చేయమని చెప్పినట్లు తెలిపారు.పట్టణంలో అంతర్గత రోడ్ల విస్తరణ, వీధి దీపాలు ఏర్పాటు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు అనుసంధానం చేసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు పోవాలని వారిని ఆదేశించారు. అలాగేపర్యావరణ పరిరక్షణ కోసం మైనారిటీ కాలనీల్లో ఈనెల 18న 10 వేల మొక్కలు నాటే కార్యక్రమం ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పట్టణంలో పారిశుధ్య పనులను ఎక్కటికక్కడ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వర్షాకాలంలో సందర్భంగా కాలువలు ప్రతి రోజూ శుభ్రం చేసి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి.సామాన్య ప్రజలకు వేగంగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి అధికారులతో చర్చించిన తర్వాత కర్నూల్ నుండి ఎమ్మిగనూరు వరకు సత్వరమే ప్యాచ్ వర్క్ లు వేసి గుంతలు లేనట్టు చూడాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక పథకం ప్రకారం అమలు చేస్తుందని, దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఒక ప్రణాళిక ఉందన్నారు. వైసిపి నాయకులు వాటిపై ప్రశ్నించడం దయ్యాల వేదాలు వల్లించినట్టు ఉందని అని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,ఆర్ బి డి ఈ నాగరాజు,ఆర్డబ్ల్యూఎస్ డి ఈ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

# తొలి ఏకాదశి సందర్భంగా సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు..

కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 15 విభారె న్యూస్...అష్టోత్తర శత కలశములతో(108 మంది దంపతుల చేత) తొలి ఏకాదశి (17-07-2024 బుధవారము) పర్వదినము సందర్భంగా ఆరోగ్యమును ఐశ్వర్యమును ఉద్యోగమును అన్నింటినీ ప్రసాదించేటువంటి శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి విశేష అభిషేకములు హోమములు జరగను.భక్తాదులు స్వయముగా శ్రీ సూర్యనారాయణ స్వామివారి విగ్రహమునకు అభిషేకము చేసుకొనవచ్చును.భక్తాదుల ఆనవాయితీ ప్రకారంగా అభిషేక అనంతరం జలమును తమ ఇళ్లకు తీసుకువెళ్లి ఇల్లు అంతా ప్రోక్షణ చేసుకోవడం అందరికీ తీర్థముగా ఇవ్వడము స్నానము చేయుముందు కొద్దిగా కలుపుకుని స్నానం చేయడం వలన శరీర రుగ్మతలు తొలగి ఆరోగ్యము సిద్ధిస్తుంది అని ప్రశస్థి.అభిషేక సమయము అభిషేక రుసుము ఉదయం 9-00 గంటలకు సూర్య కలశ పూజ ప్రారంభం అవుతుంది.సూర్య కలశ అభిషేక రుసుము-300 రూ.సాయంకాలము 6-00 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ సహిత సుదర్శన హోమము జరుగును.సుదర్శన హోమ రుసుము -3,500భక్తాదులకు సూచన- అభిషేకము మరియు హోమానికి వచ్చేటువంటి వారు పూలు పండ్లు తమలపాకులు వలిచిన టెంకాయ-1 పీచు టెంకాయ -1 రవికె పీసు -1తెచ్చుకోగలరు.(మిగతా పూజా ద్రవ్యములు దేవాలయం వారు ఏర్పాటు చేయుదురు.)వివరములకు సంప్రదించగలరు.జి. వినయ్ కుమార్ శర్మకృష్ణ యజుర్వేద పండితులుదేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777

# శ్రీ నరసింహా ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణానికి భక్తుల విరాళం...



కౌతాళం జూలై 15 విభారె న్యూస్..శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కొరకు డోన్ వాస్తవ్యులైన మాన్వి విక్టరీ ఆనందరావు వారు ?.50,000/- విరాళంగా చెల్లించియున్నారు. దాతలకు శ్రీ స్వామి వారి దర్శనం, స్వామివారి శేష వస్త్రము, లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో సూపర్డెంట్ జేకే మల్లికార్జున, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు

# సైనికుడి సన్మానం దేశానికి చేసినట్టు... ఎమ్మిగనూరు లో ఆర్మీ జవాన్ కు ఘన సన్మానం..

ఎమ్మిగనూరు జూలై 15 విభారె న్యూస్.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన బండా సత్యనారాయణ ఇండియన్ ఆర్మీ లో సేవలందించి పదవి విరమణ పొంది ఎమ్మిగనూరు కు రావడంతో సోమవారం ఆయనకు ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు,క్రీడాకారులు,మిత్రులు వారి కుటుంబ సభ్యులతో కలిసి బిఎస్ఎఫ్ జవాన్ ను ఘన స్వాగతం పలికారు. దేశం కోసం కుటుంబాన్ని వదిలి 22 సంవత్సరాల పాటు సేవాలందించి తిరిగి రావడంతో పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదికలో తెదేపా నాయకులు రామకృష్ణనాయుడు, రంగస్వామిగౌడ్, వైసిపి నాయకులు పాల శ్రీనివాసరెడ్డి ప్రిన్స్ సేవా సమితి అధ్యక్షుడు వహాబ్, విజేత నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు లచ్చప్ప, డిప్యూటీ తహశీల్దార్ విజయ్, లు కలిసి దుస్సాలువలు పూలమాలలతో జ్ఞాపిక ను అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం సోమప్ప సర్కిల్, వైఎస్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చి వీవర్స్ కాలనీ తన ఇంటికి చేర్చారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. సైనికుడికి సన్మానం దేశానికి చేసినట్టేనన్నారు. దేశ సరిహద్దుల్లో ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న ఆర్మీ ఉద్యోగం చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్,శ్రీధర్ ,వెంకటేష్,రెహ్మాన్,శ్రీనివాసులు, ఎద్దఈరన్న,శ్రీరామ్,సిజి.ఈరన్న, చాంద్, ఓంకార్,కర్ణ, చంద్రమోహన్, వీరశేఖర్ ,మాదన్న, అశోక్,స ర్తాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190